గర్భిణీలకు నెలనెలా భోజన ఏర్పాటు ఆనందదాయకం

విశాలాంధ్ర-జామి : గర్భిణీలకు నెలవారీ తనిఖీల నిమిత్తం జామి పిహెచ్‌సికి వస్తున్నారని, భోజన సమయంలో వారికి ఇబ్బంది కలుగకుండా తగిన పౌష్టికమైన భోజనంను దాతలు ప్రతీ నెలా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని పిహెచ్‌సీ వైద్యాధికారిణి డా. నాగశ్వేత అన్నారు. ఈనెల గర్భిణీలకు తనిఖీలను గురువారం ఏర్పాటు చేసారు. మద్యాహ్నం శ్రీసత్యసాయి భజన మండలి మాజీ కన్వీనర్ విన్నకోట సీతారామయ్య(నానాజీ) గర్భిణీలకు భోజనాన్ని ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాన్ని వైద్యాధికారిణి గర్భినీలకు వడ్డించి ప్రారంభించారు. దాదాపు 100మంది వరకు గర్భిణీలకు, వారి సహాయకులుకు, వైద్యసిబ్బందికి భోజనాన్ని వడ్డించారు. ఈకార్యక్రమంలో నార్లమహంతి నారాయణరావు, రమణీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులకు సాగు పట్టాలు ఇచ్చేవరకు సీపీఐ పోరుబాట తప్పదు

- పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్‌లు హెచ్చరిక

విశాలాంధ్ర-బొబ్బిలి : కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకూ సూపర్ సిక్స్ పథకాలు అమలుచేసేది ఎప్పుడని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు గిరిజన సాగు చేస్తున్న భూములకు సాగునీరు పట్టాలు ఉన్న అలాగే వారు నివాసముంటున్న గ్రామాలను దగ్గరలో ఉండే పంచాయతీల్లో చేర్పించే వరకు సిపిఐ పార్టీ పోరుబాట సాగిస్తుందని సిపిఐ పార్టీ ఒమ్మి రమణ అన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఒమ్మి మాట్లాడుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని, గిరిజనుల సాగుచేస్తున్న భూములకు పట్టాలిచ్చి, గ్రామాలను అందుబాటులో ఉండే పంచాయతీలో చేర్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, పి.కృష్ణ సిపిఐ శాఖ కార్యదర్శి బిహెచ్. చిరంజీవి, జీర, టింగు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : కూటమి ప్రభుత్వంలో పేదలు 2 సెంట్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకునే హక్కు లేదా అధికారుల దగ్గరకి వెళ్ళి అర్జీలు చేసుకోడానికి వెళ్ళే పేదలని భయపెడతారా అని సిపిఐ జిల్లా

సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని, ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఉన్న చోటే పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో 3 రోజు విజయనగరం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టి ఎ.ఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా పేదలకు 2 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలం నిరణానికి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సర్వేల పేరుతో కాలక్షేపం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితి బాగులేక ఇల్లు నిర్మాణం చేసుకోలేని వాళ్ళ దగ్గరకి సచివాలయం అధికారులను పంపించి మీరు ఇల్లు కట్టుకోలేదు కాబట్టి మీ ఇంటి పట్టాను రద్దు చేస్తున్నామని లబ్దిదారులను ఆందోళన గురి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగలేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలా అర్జీలు చేసుకోడానికి ముందుకు వస్తుంటే వాళ్ళని భయపెడతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలుకాలేదని అధికారులు చెబుతున్నారన్నారు.

2014-19 టీడిపి పాలనలోనే ఇదే పరిస్థితి నెలకొందని. తొలుత మూడేళ్లపాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా తర్వాత ఇచ్చారన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే సరికి 2019 ఎన్నికలు దగ్గరపడ్డాయి. టీడిపి పరాజయం చవిచూసింది అని గుర్తు చేశారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలివ్వాలని గతంలో అనేకసార్లు అర్హులైన వారితో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి 10 మాసాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఇళ్ళ స్థలాలు, ఇంటి పట్టాలు పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని, ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఉన్న చోటే పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేసేవరకు భారత కమ్యునిస్టు పార్టీ.(సిపిఐ) పేదల పక్షాన నిలబడి పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజలను భయపెట్టి ఆపాలని చూసినా భయపడేది లేదని సిపిఐ నేరుగా ప్రజల దగ్గరకి వెళ్ళి పోరాటాలు కొనసాగిస్తుందని బుగత అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, మార్క్స్ నగర్ శాఖ సహాయ కార్యదర్శి బూర వాసు, బల్లివీధి శాఖ కార్యదర్శి పొందూరు అప్పలరాజు, శాంతి నగర్ శాఖ నాయకులు సూరిదమ్మ, ఏఐటీయూసీ నాయకులు ఆల్తి మరయ్య , ఇళ్ళ స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న మహిళలు హాజరయ్యారు.

టెక్కలివలస గ్రామంలో ఎటువంటి అనారోగ్యాలు లేవు

తప్పుడు ప్రచారాలు తగదు : పెరుమాలి గ్రామ సర్పంచ్ వెల్లడి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పెరుమాలి గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఎస్. అప్పల నరసింహరాజు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ తెలిపిన వివరాలు మేరకు ఇటీవ కాలంలో పూడికలు తీసినప్పటికి కొంతమంది తప్పుడు ప్రచారాలు పెరుమాలి పంచాయతీపై చెయ్యడం అవాస్తవం అన్నారు. పెరుమాలి గ్రామ పంచాయితీ మధురా గ్రామం అయిన టెక్కలివలస గ్రామంలో ఎటువంటి అనారోగ్యాలు లేవని పరిశుభ్రత లోపం లేదని గ్రామంలో ప్రజలలో ఒక్క వ్యక్తికి అయినా జ్వరాలు కూడా లేదన్నారు. ఎప్పటికప్పుడు హెల్త్ సిబ్బంది కూడా పరిశీలిస్తున్నారన్నారు. అయినప్పటికీ ఆ గ్రామంలో పంచాయితీ కార్యదర్శి బి.వెంకట్ పర్యవేక్షణలో ఆగ్రామమంతటా గ్రీన్ అంబాసిడర్‌లతో కాలువ పూడికలు తీయిస్తూ అన్ని వీధులలో శానిటేషన్ పనులు మరియు దోమల నివారణకు అబ్బాట్ సొల్యూషన్ స్ప్రేచేయడం జరిగిందని సర్పంచ్ ప్రతినిధి విలేకర్లతో తెలిపారు.

నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం : సంతకవిటి మండలం మామిడిపల్లి పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ బి.పద్మ, యూనిట్ ఇన్చార్జి పాత్రుని వెంకటరమణ, గ్రామ సర్పంచులు, కొల్ల అమ్మాజీ నాయుడు మోడల్ మేఖర్ అన్నంనాయుడు, పంచాయతీ సెక్రెటరీ కోటీశ్వరరావు గ్రామ పెద్దలు రైతులు ఈ గ్రామసభలో పాల్గొనడం జరిగింది. గ్రామసభ ముఖ్య ఉద్దేశం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు నవధాన్యాలు విత్తనాలు 12 కేజీలు పప్పు దినుసులు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు ఒక ఎకరాకు 12 కేజీలు చొప్పున ఖరీఫ్ లో వేసుకుంటే 45 రోజుల తర్వాత ఓసారి కలుపుకోవాలి. వీటివలన నేల సారవంతం పెరుగుతుంది. పంటకు కావలసిన సూక్ష్మ స్థూల పోషకాలు లభిస్తుంది ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకుంటుంది. రైతులకు రసాయని వ్యవసాయానికి బదులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పెట్టుబడులు తగ్గి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతో పాటు నేలతల ఆరోగ్యాన్ని కాపాడుకొని భవిష్యత్తు తరాల వారికి అందించడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ఘనజీవమృతం, బీజమృతం, ద్రవ జీవమృతము, నియమాస్త్రము మొదలైనవి రైతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గుతుంది దిగుబడి పెరుగుతుంది అని వివరించారు.

గ్రామానికి ఆ పంచాయతీ సెక్రెటరీ ఆదర్శం

ముసిడిపల్లి పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : శృంగవరపుకోట మండలం ముసిడిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అనిల్ కుమార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా అహర్నిశలు కృషి చేస్తూ, సామాజిక సేవ కార్యకలాపాలలో ముందస్తుగా ఉంటూ ఎంతోమంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తూ విద్యాదాతగా మన్ననలను పొందుతున్నారు. చిన్ననాటి నుండి సేవాభావంతో మెలిగి ప్రతి సంవత్సరం అవసరంలో ఉన్న పేదవారికి వస్త్రదానం చేస్తూ ఉన్నారు. అదేవిధంగా వేసవికాలం సందర్భంగా గ్రామాన్ని ఆనుకుని ఉన్న బొడ్డవర మరియు విజయనగరం హైవే జంక్షన్ వద్ద వేలాదిమంది రహదారి మార్గంగా ప్రయాణించే ప్రయాణికులకు దాహార్తిని తీరుస్తూ ప్రజల మన్నలను అనిల్‌కుమార్ పొందుతున్నారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాల పిల్లలకు వైట్ బుక్స్ పంపిణీతో పాటు ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటుచేసి ఎండాకాలం రెండు నెలలపాటు ఔషధ గుణాలు కలిగిన పొడర్లు వినియోగించి వేసవికాలం అంతటా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పంచాయితీ పరిధిలో ఉన్న దాతల ఆర్థిక సహాయసహకారాలతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు అనిల్‌కుమార్ తెలియజేశారు. ఈసందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమానికి సహాయ సహకారాలు చేస్తున్న దాతలు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

రాజ్యాంగబద్ధంగా గ్రామసభలు నిర్వహించాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఈనెల 14 నుంచి గ్రామాల్లో జరిగే గ్రామసభలను రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షులు, కార్యదర్శి చందక రమణ, సూర్యం కోరారు. గురువారం నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు ఆసంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. అన్నిశాఖల అధికారులు హాజరైనప్పుడే గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ గ్రామసభలను వారం రోజులపాటు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఒకటి రెండు రోజుల్లోనే ముగించడం సరి కాదన్నారు. రోజుకు ఒక్క గ్రామంలోనే సభ నిర్వహించాలని కోరారు. వినతిపత్రం అంద జేసినవారిలో సభ్యులు కెల్ల రమణ తదితరులు ఉన్నారు.

2018లో పట్టాలిచ్చారు... స్థలం చూపలేదు

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మండల కేంద్రంలోని నిరుపేదలకు 2018లో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలకు సంభందించి నేటికీ స్థలం చూపలేదని, పట్టాలు లేని అర్హులకు ప్రభుత్వం వెంటనే 3సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని సిపిఐ ఎస్.కోట నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో కొత్తవలస తహసిల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేగల అప్పలరాజు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిచే పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో అనేకమందికి నేటికీ స్థలం చూపలేదని, అలాగే అర్హులైన ఎంతోమంది సొంత ఇంటి కోసం నిరీక్షిస్తూ.. అద్దె ఇళ్లల్లో అరకొర సంపాదనతో అవస్థలు పడుతూ జీవిస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో బాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి 5లక్షల హామీని అమలు చేసి పేదోడి సొంతయింటి కలను నెరవేర్చలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు న్యాయం జరిగే వరకు భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) పోరుబాట కొనసాగుతుందని దేగల స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ బి. నీలకంఠరావు, డిప్యూటీ తహసీల్దార్ పి. హరికుమార్ లకు బాధితుల పట్టా జెరాక్స్ లతో సహా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు బాధితులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు వెంటనే పెన్షన్లు మంజూరు చెయ్యాలి

పేదలకు మద్దతుగా వైయస్సార్సీపి నాయకులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్న కనీసం ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ఉందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు గురువారం చీపురుపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయంవద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి బూరిడీ కొట్టించి పదవిలోకి వచ్చి కూటమి ప్రభుత్వం సుమారు పది నెలలు అవుతున్న ఇంతవరకు ఒక కొత్త పెన్షన్ ఇవ్వని చేతకాని ప్రభుత్వం అని ఆయన ఎద్దేవా చేశారు. అర్హత ఉండి సచివాలయంలో దరఖాస్తు చేసుకొని ఆన్లైన్ అయి ఉన్న సుమారు చీపురుపల్లి మండలానికి చెందిన 300 పెన్షన్‌దారులతో కలిసి చీపురుపల్లి మేజర్ పంచాయతీ సానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ గారికి బాధితులు తరవున వినతిపత్రం అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో విజయనగరం జిల్లా పార్లమెంటు మాజీ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్‌తోపాటు, విజయనగరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, విజయనగరం జిల్లా వైస్సార్సీపీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, చీపురుపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణిశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ ఆఫీసు నుండి ర్యాలీగా మెయిన్ రోడ్డు మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏవో ప్రవీణ్‌కి వినతిపత్రం అందచేసారు. జిల్లా వైస్సార్సీపీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఒక్క చీపురుపల్లి మండలంలో అర్హత ఉండి ఆన్లైన్ అయిన పెన్షన్ లు సుమారు 300 వరకు వున్నాయి అని, జిల్లాలో సుమారు 4000 వేల మంది అర్హులు అయి పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు అని వారికి అందరికి వెంటనే పెన్షన్ మంజూరు చెయ్యాలి అని లేదంటే రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ గారి ద్రుష్టి కి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గారి ద్రుష్టి కి తీసుకొని వెళ్లి జిల్లా మొత్తము అన్ని నియోజకవర్గల్లో ఈ నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమం మండల విప్ అధికార్ల శ్రీనుబాబు, పతివాడ రాజారావు, వివిధ గ్రామల సర్పంచ్‌లు, రఘుమండ త్రినాథ్, చందక గురు నాయుడు, పనస అప్పారావు, పిసిని శ్రీను, చింతాడ లక్ష్మణ, పొంద్రానికి రాము, చీపురుపల్లి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, బెల్లాన త్రినాథరావు, ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవిందా), ఎంపీటీసీలు, వార్డ్ మెంబెర్స్, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పెంక్షన్ కొరకు వేచి చూస్తున్న లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి తిరుమలరావు దంపతులు

విశాలాంధ్ర-వంగర : పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ సంగమేశ్వర స్వామి వారిని 'జిల్లా జడ్జి తిరుమలరావు వారి ధర్మపత్ని వెంకటలక్ష్మి లుదర్శించుకొన్నారు. వేదమంత్రాలతో పూజలు అభిషేకాలు చేసిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి రావును జడ్జి తిరుమల రావు స్థల పురాణ విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆయనకు కండువా వేసి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి దంపతులకు ఆశీర్వచ నాలు అందజేశారు. ఆయన వెంట ఎస్ఐ షేక్ శంకర్, శంకరరావు తదితరులు ఉన్నారు.

ప్రధాన కాలువల్లో పూడికతీత ప్రక్షాళన

విశాలాంధ్ర -విజయనగరం : గత కొంతకాలంగా ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది పరిశుభ్రపరిచారు. జెసిబిల సహాయంతో పూడికపోయిన చెత్తాచెదారాలను తొలగించి వేశారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతంలో ప్రధాన కాలువ చెత్తలతో పేరుకు పోయి నీరు నిలవ ఉండిపోయింది. కొంత నీరు రహదారిపైకి వచ్చింది. దీనిని గమనించిన కమిషనర్ పల్లి నల్లనయ్య వెంటనే కాలువ పరిశుభ్రతకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జెసిబిలను రప్పించి త్వరితగతిన పూడికతీత ప్రక్షాళన చూపెట్టారు.

పైప్‌లైన్లకు మరమ్మత్తులు.. నగరంలో అక్కడక్కడ ఏర్పడిన పైప్ లైన్ లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కొత్తపేట, బాబా మెట్ట, సాకేటి వీధి తదితర ప్రాంతాలలో ఏర్పడిన లీకేజీ పనులను చేపట్టామన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.

మరణించిన పోలీసు కుటుంబానికి 'చేయూత' అందజేత : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన ఎఆర్ కానిస్టేబులు కుటుంబానికి చేయూతను అందించేందుకు పోలీసు సిబ్బంది ప్రోగు చేసిన మొత్తాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవసాత్తు, ఆకస్మికంగా, అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలు అర్ధంతరంగా తమ కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో వారికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందేంత వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసుశాఖకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కొంత మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు "చేయూత"గా చెక్ ను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని అన్నారు. జిల్లా పోలీసుశాఖలో ఆర్మడ్ రిజర్వు విభాగంలో కానిస్టేబులుగా పని చేసిన సిహెచ్. గోపాలరావు అనారోగ్య కారణాలతో మార్చి 8న మరణించగా, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత'గా పోలీసు సిబ్బంది ప్రోగు చేసిన రూ. 1,48,000/-ల చెక్కు వారి సతీమణి సిహెచ్. శారదకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని, వెంటనే దరఖాస్తు చేయాలని, ఇతర ధృవీకరణ పత్రాలను జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, డిపిఒ ఎఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు పోలీసు అసోసియేషను అడహక్ అధ్యక్షులు కే.శ్రీనివాసరావు మరియు పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

విశాలాంధ్ర-భోగాపురం : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. భోగాపురం నుంచి తగరపువలస వైపు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సీఐ ప్రభాకర్ తెలిపారు. తీవ్ర గాయాలైన ఈమె కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మరణించినట్టు ఆయన తెలిపారు వయసు 45సంవత్సరాలు ఉంటుంద న్నారు. ఈమె ఆచూకీ తెలిసినవారు భోగాపురం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని కోరారు.

పునఃనిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-మెంటాడ:మెంటాడ మండలంలో నూతనంగా పునఃనిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని గురువారం నాడు గిరిజన సంక్షేమ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి జనాలకు అంకితం చేశారు. ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రివర్యులు నూతన భవనాన్ని ప్రారంభించి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమైంది. పాత భవనంలో సౌకర్యాల కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇప్పుడు ఇది ఆధునిక సదుపాయాలతో సిద్ధంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో యం.ఆర్.ఓ కోరాడ శ్రీనివాసరావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు గెద్ద అన్నవరం గొర్లె ముసలినాయుడు, రెడ్డి ఎర్రినాయుడు, రెడ్డి ఆదినారాయణ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే స్థానిక ఎన్నికల్లో 100శాతం సీట్లు సాధించాలి

కార్యకర్తలకు మంత్రి సంధ్యారాణి పిలుపు

విశాలాంధ్ర-మెంటాడ : వచ్చే స్థానిక ఎన్నికలలో మండలంలో వందకి వంద శాతం సీట్లు సాధించాలని అందుకు తగిన ప్రణాళిక కోసం సమిష్టి కార్యచరణ రూపొందించి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. లక్ష్మీవారం మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు అధ్యక్షతన మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పార్టీ సమిష్టి కార్యాచరణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై సమీక్ష చేయడంతో పాటు ప్రజల సమస్యలపై స్పందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి చేరేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 31 పంచాయతీలలో గల ప్రజా ప్రతి నిధులు పార్టీ కార్యకర్తలతో ఎప్పటికప్పుడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ రోడ్లు సదుపాయం, తాగునీరు, విద్య ,వైద్యం ఆరోగ్యం పలు రకాల సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ అభివృద్ధి కొరకు తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలలో మమేకమై ఉండాలని మండలంలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే నాదృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడతానని తెలిపారు. మండల నాయకులు కార్యకర్తలు ఐక్యంగా ఉండి రూపొందించిన కార్యచరణను అమలు చేయుటకై నిరంతరము కృషి చేసి పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెద్ద అన్నవరం గొర్లె ముసలి నాయుడు రెడ్డి ఆదినారాయణ రెడ్డి ఎర్రి నాయుడు రెడ్డి రాజగోపాల్ కొల్లు అప్పారావు రాయిపిల్లి రవి శంకర్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత పరిశీలన

విశాలాంధ్ర-దత్తిరాజేరు/బాడంగి : దత్తిరాజేరు, బాడంగి మండలాలకు త్రాగునీరు అందించే రక్షిత నీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత గురువారం తనిఖీ చేశారు. ఈ పథకం నుంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బాడంగి జెడ్‌పిటిసి సభ్యులు లేవనెత్తిన త్రాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, ఈ పథకాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కవిత ఈ పథకాన్ని గురువారం పరిశీలించారు. బాడంగి మండలంలోని వేగావతి నదిపై పాల్తేరు గ్రామం వద్ద ఉన్న ఊటబావుల నుంచి బాడంగి, దత్తిరాజేరు మండలాల్లోని 68 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ఈ పథకం సక్రమంగానే పనిచేస్తోందని, ఎటువంటి అంతరాయం లేదని ఆమె తెలిపారు. మొత్తం 68 గ్రామాలకు త్రాగునీటి సరఫరా జరుగుతోందని ఎస్ఈ స్పష్టం చేశారు.

గ్రంధాలయాలపై పర్సన్ ఇంచార్జ్ సేతు మాధవన్ సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం: గ్రంధాలయాల పర్సన్ ఇంచార్జ్‌గా ఛార్జ్ తీసుకున్న జేసీ సేతు మాధవన్ జిల్లా కేంద్ర గ్రంధాలయం లో గ్రంధాలయాల లైబ్రేరియన్లతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా లైబ్రరీ కు విచ్చేసిన విద్యార్థులు, రీడర్స్ తో మాట్లాడి లైబ్రరీ లో అందుతున్న పుస్తకాలు, సౌకర్యాల పై అడిగి తెలుసుకున్నారు. గ్రంధాలయాల రావలసిన సెస్ ను వసూలు చేయాలని లైబ్రరీయన్లకు జేసీ సూచించారు. ఈ సమావేశంలో గ్రంధాలయ కార్యదర్శి బి.లక్ష్మి, జిల్లా కేంద్ర గ్రంధాలయం లైబ్రేరియన్ శ్రీనివాస్, మండల గ్రంధాలయాల లైబ్రరీయన్లు పాల్గొన్నారు.

చింతలపేటలో నేడు ఏడు ఆలయాల ప్రతిష్ట

విశాలాంధ్ర-గుర్ల : మండలంలోని చింతలపేట గ్రామంలో నిర్మించిన ఏడు కోవెళ్ళ ఆలయమునకు శుక్రవారం ప్రాణ ప్రతిష్ట చేయనున్నట్టు ఆలయ ధర్మకర్త సంచాన వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుండి 13 వరకూ మూడు రోజుల పాటు చింతలపేట గ్రామంలోని హై స్కూల్ ఎదురుగా కదురమ్యంగా నిర్వహించనున్న ప్రతిష్ట కార్యక్రమాలకు భక్తులు యావన్మంది విచ్చేసి భగవంతుని అశీస్సులు పొందాలని ఆయన కోరారు.

పౌష్టికహార పక్షోత్సవం నిర్వహణ

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో గురువారం తెర్లాం సెక్టార్‌లో పౌష్టికహార పక్షోత్సవం 1000 రోజుల కార్యక్రమం ఏడబ్ల్యుసి-3 నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు సిడిపిఓ రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం, తెర్లాం పరిధిలో ఉన్న అందరు ఏ డబ్ల్యు డబ్ల్యు లు పాల్గొన్నారు అని సిడిపిఓ రాజ్యలక్ష్మి విలేకర్ల తో తెలిపారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య

విశాలాంధ్ర-డెంకాడ : జిల్లాలో గల 13 ఆదర్శ పాఠశాలలు 2025-26 విద్యాసంస్థలకు ఆరవ తరగతి విద్యార్థులు చేర్చుకొనుటకై గతంలో ప్రకటించిన 20-4-25 (ఆదివారం) నాడు జరగవలసిన ప్రవేశ పరీక్షను ఈస్టర్ పర్వదినం కావున ఈ పరీక్షను 21- 4- 25(సోమవారం) కు మార్చబడిందని ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఒక ప్రకటనలో తెలియజేశారు కావున అక్కివరం ఆదర్శ పాఠశాలలో 21 -4 -25(సోమవారం) నాడు పరీక్షలు నిర్వహిస్తారు కావున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 21 -4- 25 ఉదయం 10 గంటలనుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు విద్యార్థులు హాల్ టికెట్లు వెబ్ సైట్స్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని ఆమె కోరారు.

టీడీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడ మండలం ఆగూరు పంచాయతీ నుంచి మాజీ సర్పంచ్ పెంటి అవురయ్య ఆధ్వర్యంలో మాజీ పి.ఏ.సి.యస్ అధ్యక్షులు గొర్లె ముసలి నాయుడు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వీడి 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని సాదరంగా ఆహ్వానించిన మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి పార్టీలో నికి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీతరపున అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు గెద్ద అన్నవరం రెడ్డి ఆదినారాయణ రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎర్రి నాయుడు యం.పి.టి.సి సిద్దల లక్ష్మీ పాల్గొన్నారు.

13న వియ్యంపేట గురుకులంలో ప్రవేశపరీక్ష

విశాలాంధ్ర-కొత్తవలస : మండలంలోని వియ్యంపేట వద్దనున్న డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాటశాల/కళాశాలలో (బాలికలు) 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికిగానూ ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10నుంచి 12గంటల వరకూ 5వ తరగతికి, మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్విధానంలో ఉంటుందని, ఈ పరిక్ష ఓఎంఆర్ షీట్ విధానంలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ కొరకు http.apbragcet.apcfss.in వెబ్సైటు ద్వారా డౌన్లోడ్ చేసుకొని పరిక్షా కేంద్రానికి గంట ముందు హాజరుకావాలని ఆమె తెలియజేసారు.

మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

విశాలాంధ్ర-కొత్తవలస : పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడాలని కొత్తవలసలో జనసైనికులు గురువారం పలు దేవాలయాల్లో పూజలు చేశారు. జనసేన నియోజకవర్గ నాయకులు గౌరపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక దుర్గాదేవి ఆలయంలో అర్చనలు చేశారు. అగ్ని ప్రమాదంలో గాయపడ్డ మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడి, క్షేమంగా ఇంటికి చేరుకోవాలని వారు ఆకాక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోగాది దేవా, కొట్యాడ అయ్యప్ప, గుమ్మడి దారబాబు, ముచ్చకర్ల శ్రీను, పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి : ఎస్ఐ

విశాలాంధ్ర-చీపురుపల్లి : నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చీపురుపల్లి ఎస్సై ఎల్ దామోదర్ రావు కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి మండలం పెదనడిపల్లి గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులు యువతతోను మాట్లాడుతూ గ్రామాల వారీగా నేరాల నియంత్రణ కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రత్యేకించి గ్రామాలు మత్తుపానియాలకు యువత దూరంగా ఉండాలని అదేవిధంగా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. రహదారి భద్రతకు సంబంధించి వాహనాలు నడిపేటప్పుడు అన్ని రకాల రికార్డులతో పాటు రోడ్డు సేఫ్టీకి సంబంధించి ప్రతి ఒక్కరు హెల్మెట్లను ధరించాలని ఆయన సూచించారు., అంతేకాకుండా మహిళల పట్ల జరుగుతున్న పైన కూడా ప్రతి ఒక్కరు స్పందించాలన్నారు ఇటువంటి కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరించిన పోలీసులకు సమాచారం అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పెద్దలతో సమావేశం అనంతరం పోలీస్ సిబ్బందితో అక్కడ నిద్రించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చితికిపోతున్నాం... సమస్యలు తీర్చండి

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

విశాలాంధ్ర-భోగాపురం : జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రస్తుతం నెలకు కేవలం 10 వేల వేతనంతో అతి భారంగా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ తమ సమస్యలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తూ బుధవారం ఎంపీడీవో కు వినతిపత్రం అందించారు. ఈ 19 ఏళ్లకాలంలో ఉపాధి హామీలో రకరకాలు మార్పులు వచ్చాయి. కూలీలకు దశలవారీగా కూలీ రేట్లు పెరిగాయి. కానీ క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న మాకు జీతాలు పెంచలేదు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా మేము ఈ పని మీద ఆధారపడి రోజంతా పనిచేస్తున్నాం. రోజురోజుకీ పెరిగే ధరలు, వైద్య ఖర్చులు పిల్లల చదువులు భారంగా మారుతున్నాయి. కానీ మా జీతాలు పెరగకపోవడంతో చాలీచాలని జీతాలతో కుటుంబ జీవనం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మ్యాన్ డేస్ విధానాన్ని రద్దుచేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ముఖ్యంగా అర్హత అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు.మెట్లుకు గౌరవ వేతనంతో పాటు హాజరు వేయడానికి ఫోన్ కూడా ఇవ్వాలి. ఫీల్డ్ అసిస్టెంట్ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి 10 లక్షలు చెల్లించాలి కారుణ్య నియామక పద్ధతిలో కుటుంబంలో వారికి ఉపాధి కల్పించాలి డిమాండ్ చేశారు.

నాటుసారా నిర్మూలనకు కృషి : ఎంపీపీ అంబళ్ళ సుధారాణి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : మండలంలోని నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సారా రహిత మండలంగా తీర్చిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని ఎంపీపీ, నవోదయం 2.0 కమిటీ చైర్ పర్సన్ అంబళ్ళ సుధారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం 2.0 కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించాలన్నారు. నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించాలన్నారు. నాటుసారా నిర్మూలనకు గ్రామ స్థాయి,కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. ముందుగా గ్రామాలలో నాటుసారా నిర్మూలనపై ప్రజ లకు అవగాహన కల్పించాలన్నారు. నాటు సారా తయారు చేయడంలో మార్పులు రాన ట్లయితే గ్రామాలలో తయారీదారులపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ సీఐ వెంకట్రావు మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నాటు సారా నిర్మూలన చేస్తామన్నారు. మండలంలో ఎక్కడా సారా తయారీ లేదన్నారు. ఎవరైనా వినియోగిస్తే కమిటీకి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఏఎస్సై మూర్తి, డీటీ రవిశంకర్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల పనులపై రాష్ట్ర టీం రివ్యూ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో పీఎం శ్రీ పాఠశాలలలో జరుగుతున్న సివిల్ వర్క్స్, అక్షర మిక్స్‌పై స్టేట్ పీఎం శ్రీ టీం విజిట్ చేయడం జరిగింది. జిల్లాలో గల 34 పీఎం శ్రీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ విభాగంతో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ ఏ రామారావు ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్లో పాఠశాలల వారీగా రివ్యూ చేసి సివిల్ వర్క్స్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సివిల్ వర్క్స్ లో భాగంగా కెమిస్ట్రీ ల్యాబ్స్, లైబ్రరీ రూమ్స్, షెల్ఫ్స్ ,కిచెన్ గార్డెన్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ తదితర పనుల పైన సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర పీఎం శ్రీ టీం సభ్యులు డాక్టర్.ఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల పనులను తనిఖీ చేయడం జరిగిందని 90% పనులు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పీఎం శ్రీ పాఠశాలల పనితీరు విషయంలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. అనంతరం సమగ్ర శిక్ష ఏపిసి డాక్టర్ ఏ రామారావు మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల పని విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. పాఠశాలల పని విషయంలో శ్రద్ధ చూపిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో పిఎం శ్రీ రాష్ట్ర టీం సభ్యులు మహేశ్వర్ రెడ్డి, జయలక్ష్మి ఏఎంఓ బి.ప్రసాద్ రావు పాల్గొన్నారు

ఘనంగా జనసేన పిఎసి సభ్యురాలు పడాల అరుణ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం మాజీ మంత్రి జనసేన పీఏసీ సభ్యులు పడాల అరుణ జన్మదినం సందర్భంగా గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎం వెంకటాపురం గ్రామంలో ఉన్న శిరిడి సాయి మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి స్వగృహ మందు కేక్ కట్ చేసి జనసేన నాయకులు కు కార్యకర్తలకు పంచిపెట్టారు. తదుపరి గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన పార్టీ మండల అధ్యక్షులు మునకాల జగన్నాథ రావు (జగన్), దత్తిరాజేరు మండల అధ్యక్షులు సిహెచ్ అప్పారావు, గంట్యాడ మండల అధ్యక్షులు సారధి అప్పలరాజు, రాంబాబు, ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మామిడి దుర్గాప్రసాద్, మండల లక్ష్మనాయుడు, ఐటీ విభాగం కోఆర్డినేటర్ బోడ సింగి సునీల్, తాళ్లపూడి కృష్ణ, పి ఓ సి ఆదాడ మోహన్, దేవుపల్లి గ్రామం నుండి జనసేన లీగల్ సెల్ మెంబర్ రాపాక సాయి సురేష్, ఇట్లా తిరుపతిరావు, యశ్వంత్, టిడిపి యూత్ మరియు నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వర స్వామి 7వ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మండల పరిధిలోగల దత్తి గ్రామంలో శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి 7వ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ను ఈ నెల 13న జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పెంకు తిరుపతి తెలిపారు. గతంలో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి హస్తములతో ప్రతిష్టించబడిన ఈ ఆలయం లో శ్రీ విశ్వక్సేన మరియు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. అలాగే ఈ నెల 13 ఆదివారం ఉదయం నుండి ఆలయ అర్చకులు శ్రీమత్ కందాడ హరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పెంకు తిరుపతి, లక్ష్మి దంపతులు గురువారం విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తరలిరావాలని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలియజేసారు.

వైసిపి తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరు

జనసేన ఇన్‌ఛార్జి విసనగిరి శ్రీను

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆ పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ విసనగిరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ ఇటీవల అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా పర్యటన సందర్భంలో విశాఖపట్నం ఎయిర్పోర్ట్ నుంచి అరకు ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో చిన్న ముసిడివాడ డిజిటల్ అయాన్ జోన్ వద్ద నీట్ ఎగ్జాం రాయడానికి వెళ్లే విద్యార్థులకు ట్రాఫిక్ వలన అంతరాయం కలిగిందని, దీని కారణంగా విద్యార్థుల పరీక్షలకు హాజరు కాలేకపోయారని వైసీపీ నాయకుల అవాకులు చవాకులు పేలుతూ ఉన్నారన్నారు. అసలు నిజమేంటో తెలియకుండా అసత్య ప్రచారాలను మా అధినేత పవన్ కళ్యాణ్ పైన చేయడం చాలా విడ్డూరంగా ఉందని విసనగిరి వివరించారు. విశాఖ ట్రాఫిక్ అడిషనల్ సీపీ ఈ సంఘటన పైన సిసి ఫుటేజ్ వీడియోలు బయటపెట్టి అసలు వాస్తవాలు ప్రజలకు తెలియజేయడం జరిగింది అన్నారు.. ఈ వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలతో మా అధినేతపై లేనిపోని బురద జల్లాలని ప్రయత్నం చేయడం చాలా సిగ్గుచేటని ఆయన అన్నారు. గత ఎలక్షన్లో ప్రజలు రెండు ఒకట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదని ఈసారి ఆ ఒకటి పోయి ఒకటే మిగులుతుందని ఎద్దేవా చేశారు. అలాగే పోలీసులను గుడ్డలూడదీయించి రోడ్లపై పరిగెత్తిస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. ఒకసారి మా పోలీస్ సోదరులందరు ఐక్యతగా ఆలోచించి ఆయన బందోబస్తుకు వెళ్ళకుండా స్ట్రైక్ చేస్తే ప్రజలు చేతుల్లో ఎవరికి గుడ్డలూడిపోతాయో బాగా అర్థమవుతుందని తెలిపారు ఆయన సూచించారు. అలాగే పాస్టర్ ప్రవీణ్ మరణం పై కూడా శవరాజకీయాలు చేస్తూ కులాలను మతాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసి, శవాలపై పేలాలు అమ్ముకునే వారిగా ఈ వైసీపీ నాయకులు తయారయ్యారని విమర్శించారు. గతంలో వీరు చేసిన అన్యాయాలు అక్రమాలు భూకబ్జాలు ఇసుక మైనింగ్ మాఫియాలు, దౌర్జన్యాలకు, మహిళలను కించపరిచే బూతుల మంత్రులకు, వీరు మద్యం మాఫియాలో వేల కోట్ల అవినీతిలో ఈ దండుపాలెం బ్యాచ్ అంతా జైలు పక్షులు కావడం ఖాయమని హెచ్చరించారు.

పల్లె పుష్కరణిపై ఓ కన్నేద్దాం

- అమృత సరోవర్‌లా కాకుండా చూద్దాం

- ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వరప్రసాద్

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్రప్రభుత్వం చేపట్టనున్న పల్లె పుష్కరిణి కార్యక్రమంలో అవకతవకలు జరగకుండా ఓ కన్నేద్దామని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం సంతోషదాయక మన్నారు. అయితే పల్లె పుష్కరణి కార్యక్రమం మరో అమృత సరోవరం కార్యక్రమంలా కాకుండా జాగ్రత్త పడదామని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులకు, సభ్యులకు పిలుపునిచ్చారు. మన రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి పల్లె పుష్కరిణి అనే కార్యక్రమంలో భాగంగా చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో సెంట్రల్ గవర్నమెంట్ చేపట్టిన అమృత సరోవర్ అనే పథకంలో చేసిన కార్యక్రమాలు దాదాపు బిల్లులు కోసమే జరిగాయని ఆరోపించారు. చెరువులకు మాత్రం పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్నారు. దీంతో అమృత సరోవర అనే పథకం విఫలమై పూర్తి ఫలితాలు ఇవ్వలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి పల్లె పుష్కరిణి కార్యక్రమంలో, అమృత సరోవరంలో జరిగిన తప్పులు లేకుండా ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సభ్యులు ఎవరి జిల్లాలో వాళ్లు, ఎవరి మండలాల్లో వాళ్ళు పల్లె పుష్కరణి పనులు జరుగుతున్న కోసేరు, చెరువుల దగ్గరికి వెళ్లి పరిశీలించి ఏమైనా అవకతవకలు, పనుల్లో నాణ్యత లోపం గాని ఉంటే వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళదాం అన్నారు. అందరం కలిసి మన నీటి వనరులను మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 30 తారీఖు లోపు పల్లె పుష్కరిణి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సుమారుగా ప్రతి జిల్లాకి 30 నుండి 40 చెరువులను పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సభ్యులు కార్యక్రమంలో పాల్గొని ఎటువంటి అవకతవకలు లేకుండా మన నీటి వనరులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

జీవో.ఎంఎస్.నెం .35ను తక్షణమే సవరించాలి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వము ఇటీవల చేపట్టిన పాలనా సంస్కరణలను ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘము స్వాగతిస్తుందని, అదే సమయంలో గురువారం ప్రభుత్వము విడుదల చేసిన జీవో నెంబర్ 35 నందు జిల్లా పరిషత్‌లలో, మండల పరిషత్‌లలో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు ఎంపీడీవో పదోన్నతి కోటాలో తీరని అన్యాయం జరిగిందని, గతంలో ఫీడర్ కేటగిరిని బట్టి ఎంపీడీవో పదోన్నతిలో తమకు 34% కేటాయింపు జరిగింది. అదే సందర్భంలో ఈవోపిఆర్&ఆర్‌డి)లకు 33%, నేరుగా ఎంపీడీవో నియామకానికి 30%, ఇతరులకు 3% కేటాయింపులు జరిగియున్నాయి. సంస్కరణలో బాగంగా ఎంపీడీవో నేరుగా నియామక కోటాను రద్దు చేసినందున తమకు కేడర్ స్ట్రెంగ్త్ ప్రకారము ఎంపీడీవో పదోన్నతిలో 50% కేటాయించవలసి యుండగా కేవలం 34% మాత్రమే కేటాయింపు చేయడం దారుణమని దీనివలన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో పనిచేస్తున్నటువంటి పరిపాలన అధికారులకు, సీనియర్ అసిస్టెంట్లకు మరియు జూనియర్ అసిస్టెంట్లకు రికార్డు అసిస్టెంట్లకు, ఆఫీస్ సభార్డినేట్లకు తీరని నష్టం జరుగుతుందని, దీనిని సవరించి తమకు సహజ న్యాయ సూత్రం ప్రకారం రావలసిన పదోన్నతి కోటాను(50%) కేటాయింపు చేయవలసినదిగా ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘము, విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సిహెచ్.మురళీ, కార్యదర్శి వి.రాంబాబు, ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఏ. సురేష్, జిల్లా పరిషత్తు ఏవో లు త్రినాథ్, చైనులు ,వేదవతి,రాజేశ్వరి, ఎం ఎల్ ఎం ప్రసాద్ ,బంగారయ్య జిల్లా సంఘం నాయకులు పరిషత్తు యూనిట్ నాయకులు మరియు జిల్లాలో పనిచేస్తున్న అందరూ పరిపాలన అధికారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ మెటీరియల్ గిడ్డంగి నిర్మాణం

- అరకిలో మీటరు పరిధిలో గ్రామాలు జనావాసాలు

- కన్వర్షేషన్‌పై పలు అనుమానాలు

- పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు శ్యామలాదేవి అగ్రహారంలో రెవెన్యూలో సర్వేనెంబర్ 4లో నిర్మించిన రాతి క్వారీ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోగా చోద్యం చూస్తున్నారనడంలో సందేహం లేదు.ప్రభుత్వ నిబంధనల మేరకు దాదాపు 5కిలో మీటర్ల మేర ఎటువంటి జనావాసాలు గాని గ్రామాలు గాని ఉండకూడదు కానీ అరకిలో మీటర దూరంలో శ్యామలాదేవి అగ్రహారం గ్రామం వావిలపాడు గ్రామాలు ఉండగా అతి సమీపంలో రైతు వారి కల్లాలు కోళ్లఫారాలు,రైతుల వ్యవసాయ భూములు నిరంతరం పశువుల గొర్రెలు మేకల కాపర్లు సంచరించడం అటువంటి స్థలంలో బ్లాస్టింగ్ పదార్థాల నిల్వ గిడ్డంగికి అనుమతులు ఎలా ఇస్తారో అధికారులకు తెలియాలని పలువురు ఆక్షేపిస్తున్నారు. అలాగే ఈ గిడ్డంగి నిర్మాణ ప్రదేశాన్ని ఒక మామిడి తోటలో వ్యవసాయ భూమి నుండి వ్యవసాయేతర భూమిగా గిడ్డంగి యజమాని, భూ యజమాని మండల అధికారులతో చేతులు కలిపి ధ్రువీకరణ పత్రం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ కన్వర్షేషన్ ధృవీకరణ నిమిత్తములో బ్లాస్టింగ్ నిలువ పదార్థాల గిడ్డంగి అని అధికారులకు తెలిసినప్పటికీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకున్న యజమానికి అధికారులు కూడా గిడ్డంగి విషయంలో నిబంధన విరుద్ధంగా కన్వర్షేషన్ ఇవ్వడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అనుమతులు ఇవ్వకూడని ప్రదేశంలో కూడా అనుమతులు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాడట మాడటమేనని పలువురు దుమ్మెత్తి పోస్తున్నారు.రెవిన్యూ అధికారులు చేతివాటం చూపి గిడ్డంగి నిర్మాణ యజమానితో చేతులు కలిపి కాసులకు కక్కుర్తి పడి ధ్రువీకరణ పత్రం ఇచ్చినట్లు తెలుస్తుంది.అలాగే ఇదే విషయమై శ్యామల దేవి అగ్రహారం గ్రామ ప్రజలు గిడ్డంగి నిర్మాణానికి అనుమతులు ఇవ్వద్దని కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయగా నాటి వేపాడ తహసిల్దార్ కే.ప్రసన్న కుమార్, ఇప్పుడున్న డిప్యూటీ తాసిల్దార్ కే.సన్యాసినాయుడు గిడ్డంగి నిర్మాణ విషయమై ఏటువంటి అనుమతి ఇవ్వడం జరగదని నాడు చెప్పారని శ్యామలాది అగ్రహారం గ్రామస్తులు చెబుతున్నారు.ఏది ఏమైనా క్వారీ బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగికి అనుమతులు ఇస్తే రద్దుపరిచి చుట్టుపక్కల గ్రామాల రైతులను గ్రామాల ప్రజలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తెర్లాం తాలూకా ప్రెసిడెంట్‌గా అలజంగి బాబుకృష్ణంనాయుడు

విశాలాంధ్ర-తెర్లాం : గురువారం స్థానిక మండల కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) తాలూకా కార్యవర్గ సమావేశంలో జరిగిన ఎన్నికలలో తాలూకా అధ్యక్షులుగా అలజంగి బాబు కృష్ణంనాయుడు, కార్యదర్శిగా షేక్ బెహరనుషా, బేగం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.వెంకటరమణ, సిహెచ్ రామి నాయుడు కోశాధికారిగా, జి.శివకుమార్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, 6గురు ఉపాధ్యక్షులు, 6గురు సంయుక్త కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారిగా గిడిజాల లక్ష్ము నాయుడు పరిశీలకునిగా జి.వి.రమణ వ్యవహరించిన ఎన్నికల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసినదిగా నూతన కార్యవర్గానికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా అధ్యక్షులు తక్షణమే పి.ఆర్.సి కమిషనర్ ను నియమించాలని ఈలోగా ఐఆర్ వెంటనే ప్రకటించడంతో పాటు పెండింగ్ డిఏ లు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు సన్నాహాలు

కొత్తవలస జంక్షన్లో స్థలపరిశీలన చేసిన అధికారులు

విశాలాంధ్ర-కొత్తవలస : కూటమి ప్రభుత్వ హామీల్లో భాగంగా ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆదేశాల మేరకు కొత్తవలస మండల కేంద్రంలో అన్నక్యాంటీన్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ విభాగం డిఈ ఈశ్వరరావు, కొత్తవలస ఏమ్పీడీఓ వి.రమణయ్య, తహసీల్దార్ బి.నీలకంటరావులు గురువారం కొత్తవలస జన్నన్లో వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద స్థలపరిశీలన చేసారు. అన్నక్యాంటీన్ నిర్వహణకు స్థలం సరిపోతుందా... లేదా... ప్రజలకు సౌకర్యంగా ఉంటుందా అనే అంశాలను పరిశీలించారు. గతంలో ఈ ప్రదేశంలోనే అన్నక్యాంటీన్ నిర్వహణ కొనసాగేదని, ప్రస్తుతం ఆటో కార్మికులు స్టాండ్ గా వినియోగించుకుంటున్నారని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో టీడిపి మండలాధ్యక్షులు గౌరపల్లి రాము, కొత్తవలస మేజరు పంచాయితీ ఈఓ బి.శైలజ, జే.ఏ కృష్ణ, ఎస్.ఎం ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించండి

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండల ఎం.ఆర్.సిలో జరిగిన బడి బాట కార్యక్రమంలో 5ం వయస్సు గల విద్యార్థులను ప్రభుత్వ పాఠశలల్లో చేర్పించండి. ఈరోజు జరిగిన ప్రధానోపాధ్యాయులు సమావేశంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల చినబంటుపల్లి ప్రధానోపాధ్యాయులు అల్లి. రాంబాబు ఉపాధ్యాయులు తయారు చేసిన కరపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎం.చంద్రశేఖర్ రావు విడుదల చేశారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ నాయకులు మండల రమేష్, తలాడ మహేష్, టి. వి ఎల్.నరసింహం, అప్పలరాజు, హరికృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీదేవి, నాగమణి, జయలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లాడుతూ మన పాఠశాలలో 100% ఇంగ్లీషు మీడియం, తల్లికి వందనం పథకం వర్తింపు ఖాయం, ప్రతిరోజూ నాణ్యమైన భోజనం ఉచితం, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, ప్రతిరోజూ సాయంత్రం వ్యాయామం, ఆటలు, పరిశుభ్రమైన టాయిలెట్లు నిర్వహణ, పాఠశాలలో స్వచ్ఛమైన పూరిఫైడ్ తాగునీటి సదుపాయం కలవు అని చెప్పారు. ఆఖరిగా ఒక మాట "మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించండి-చక్కని విద్యబోధనకు మమ్మల్ని బాధ్యుల్ని చేయండి" అని చెప్పారు.

ఎంపీడీవోకి ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి

విశాలాంధ్ర-మెరకముడిదాం : ఫీల్డ్ అసిస్టెంట్లు తమ డిమాండ్స్ సాధనకు. ఎంపీడీవో జి. బాస్కరరావుకి గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా ఏపీవో ఎ.నరేంద్ర కుమార్‌కి గురువారం వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా వేతనం 26,000 పెంచాలని డిమాండ్ చేశారు..మండల బదిలీలు ఉదోగ భద్రత కల్పించాలని అక్రమంగా తొలిగించిన వారిని విధుల్లోకి చేర్చుకోవాలని అర్హత అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ కల్పించాలని రాజకీయ ఒత్తిళ్ళకి తలొగ్గి అక్రమ తొలిగింపులు ఆపాలని మాన్ డేస్ విధానాన్ని రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసి అమలు చేయాలని ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ రద్దు చేయాలని సమస్యలతో కూడిన వినతపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలి : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-మెంటాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి తక్షణ పరిష్కారం చూపాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించడానికి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో భానుమూర్తి ఆధ్వర్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలో అమలపరుచుటకు ప్రతి అధికారి పారదర్శకతతో పాటు వేగాన్ని పాటించాలని సూచించారు. పల్లె ప్రగతి, హరితహారం, పారిశుద్ధ్యం శుభ్రత, నీటి సరఫరా, నూతన పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాల పురోగతి, విద్యుత్ సరఫరా ,పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యత పై వాస్తవ పరిస్థితులను గ్రహించి సమగ్ర నివేదికను తమకు అందజేయాలని ఆదేశించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని వారు సూచనలు అవసరాలను పరిగణనకు తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. మండలంలో చేపట్టిన ప్రాధాన్యత ప్రాజెక్టుల పై సమయపాలనతో కూడిన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతుందని వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, యం.ఆర్.ఓ కోరాడ శ్రీనివాసరావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు పోలీస్ సిబ్బంది ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా దర్శించుకున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు



విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడ మెంటాడ మండలం చింతలపలస గ్రామంలో గురువారం శ్రీ షిరిడి సాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికలలో గెలి పొందిన తరువాత మొక్కును చెల్లించుకునేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పడిన బకాయిల నిమిత్తం 6000 కోట్ల రూపాయలు విడుదల చేసిందని, ఆర్థిక పరిస్థితి పుంజుకున్న తర్వాత పీఆర్సీ కమిషన్ ను వేసి మంచి ఐఆర్ ను ఇవ్వాలని కోరారు. ఆయస వెంట పలుపురు పి.ఆర్.టి.యు మండల అధ్యక్షులుసిరిపురం కృష్ణ పి.ఆర్.టి.యు నాయకులు ఉన్నారు.

పనికొచ్చే ఇళ్ల పట్టాలు ఇవ్వండి

విశాలాంధ్ర-భోగాపురం : విమానాశ్రయ నిర్వాసిత కాలనీలలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు బ్యాంకులో చెల్లటం లేదని, పనికొచ్చే పట్టాలు ఇప్పించాలని మరాడపాలెం సర్పంచ్ కోరారు. ఎంపీపీ ఉప్పాడ అనుష రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈసమావేశానికి మండలంలోగల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు,మండలంలో గల వివిధ శాఖలకు చెందిన అధికారులూ పాల్గొన్నారు.ఏర్పోర్ట్ నిర్మాణంలో మరడ పాలెం గ్రామాన్ని లింగాలవలస సమీపంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేసి నిర్వాసితులను అక్కడికి తరలించారు. వారికి పట్టాలి ఇచ్చినప్పటికీ ఆ పట్టాలతో బ్యాంకుల్లో లోన్ కోసం వెళ్ళగా ఈ పట్టాలు పై లోన్లు ఇవ్వలేమని రిజిస్ట్రేషన్ పట్టాలు తీసుకువస్తే లోన్ ఇస్తామని బ్యాంకు అధికారులు అంటున్నారని మరడపాలెం సర్పంచ్ సభ ముందుకు తీసుకువచ్చారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్మించిన అన్ని ఇళ్లకు రిజిస్ట్రేషన్‌చేసి పనికొచ్చే నూతన డాక్యుమెంట్లను ఇప్పించాలని ఎంపీపీని అభ్యర్థించారు. ఎంపీపీ అనూష రెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై స్థానిక రెవిన్యూ అధికారులతో చర్చించి మీ సమస్యకు పరిష్కారం త్వరలోనే చూపిస్తామని తెలియజేశారు. మండలంలో అన్ని గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎంపిపి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దంతులూరు సూర్యనారాయణ రాజు, పచ్చిపాల నాగలక్ష్మి,ఎంపీడీవో కిషోర్‌కుమార్, డిప్యూటీ తాసిల్దార్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సంతలో మౌళిక సదుపాయాలు కల్పించాలి

గోసంరక్షణ సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-పూసపాటిరేగ : అల్లాడి పాలెం పశువుల మరియు జంతువుల సంతలో మౌళిక సదుపాయాలు సీసీ కెమెరాలు పనిచేసేటట్లు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ. రామకృష్ణ అన్నారు. గురువారం మధ్యాహ్నం అల్లాడి పాలెం పశు పుల సంతలో జరిగిన మండల సంతల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు జంతు సంరక్షణ చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతల్లో చట్టాల అమలు జరపడానికి హైకోర్టు ఆదేశాలతో జీ.వో.నెం.23 ప్రకారం జంతువులకు హింస జరగకుండా 12 రకాల మార్గదర్శకాలను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు తెలిపిన పట్టించుకోవటంలేదని, సంతల్లో జంతువులు తాగేందుకు నీటి కుండీలు, ర్యాంపులు, నీడ నిచ్చే షెడ్లులు, సీసీ కెమెరాలు, పశు వైద్యుని యొక్క హెల్త్ సర్టిఫికెట్లు, వెహికల్ ఇన్స్పెక్టర్ చే ఫిట్ నెస్ సర్టిఫికెట్లు ఉండాలి అన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా చేయుట చట్టరీత్యా నేరం అని సంతల్లో జంతువులను హింసిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. సంతలో ఏటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలి అన్నారు. ఈసమావేశంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి.వి.వి. మాధురి, మండల పంచాయితీ విస్తరణ అధికారి జీ.జ్ఞానేశ్వరరావ్, రెల్లివలస పశువైద్యులు డా.సుదీర్, సచివాలయం పోలీసు జయదీక్ష, వెటర్నరీ అసిస్టెంట్ కామేశ్వర రావు, సంత యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని పైడిమాంబ ఆలయంలో పూజలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని గురువారం విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయంలో గురువారం జనసేన నాయకులు గురాన అయ్యలు, ఆదాడమోహన్ రావులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు ఎంటి రాజేష్, ఎమ్. పవన్‌కుమార్, పి.అభిలాష్, పృథ్వీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనా సర్పంచ్ కోట్ల రఘు లక్ష రూపాయలు వితరణ

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడ గ్రామం జెనసేన సర్పంచ్ కోట్ల రఘు ఏ గ్రామంలో దేవాలయాలు నిర్మాణం జరిగిన ఆ అవసరం తెలుసుకొని దుమ్ము లేని చేతులా తనకు తోసిన సాయం చేస్తూ తనకు దేవునిమీద ఉన్న నమ్మకాన్ని చాటుతున్నారు.తాళ్ళపేట గ్రామంలో నిర్మిస్తున్న సీతారాముల వారి దేవాలయానికి ఆయన ఆలయం కమిటీ సభ్యులకు లక్ష రూపాయలు విరాళం అందజేశారు గురువారం ఉదయం కొవ్వాడ గ్రామంలో అతని ఇంటి వద్ద ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుని సేవసేసుకొనే అదృష్టం ఈ విధం గా తనకు కలిగినందుకు ఎంతగానో సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల రఘు తో పాటు ,శివ ,తాళ్ళపేట రామాలయ నిర్మాణ కమిటీ వాళ్ల అక్కున్నాయుడు, వాళ్లే సత్యనారాయణ, వాళ్లే కస్సం నాయుడు, గుడివాడ గణపతి, పిన్నింటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై రాద్ధాంతం తగదు

విశాలాంధ్ర-చీపురుపల్లి : అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కోట మీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తూచా తప్పకుండా హామీలను అమలు చేస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామనాయుడు దన్నాన రామచంద్రుడు తదితరులు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన హామీ మేరకు 200 రూపాయల పెన్షన్ ఒకేసారి 2000 రూపాయలు చేశారని ఆయన అన్నారు. అలాగే 2000 రూపాయలను పెన్షన్ 3000 రూపాయలను చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కింది అన్నారు. గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి పెన్షన్ పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ఏడాదికి 250 రూపాయలు ఎర వేసి పెన్షన్ దారులను మోసగించారని ఆయన అన్నారు. 2024 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పింఛను రూ.4వేలుకి పెంచి, 3నెలల బకాయిలతో కలిపి రూ.7వేలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రూ.2వేలు పింఛన్ రూ.3వేలు చేయడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదు సంవత్సరాలు పట్టింది అని వారు ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి ర్యాలీలు, ఉద్యమాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కొత్త పింఛన్ల మంజూరు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఇప్పటికే లబ్ధిదారుల పేర్లను ఆన్లైన్ చేయడం జరిగింది అన్నారు. త్వరలోనే ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. ఉలోగా వైసిపి నాయకులు కావాలనే రాద్ధాంతం చేయడంతో దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు ధర్నాన రామచంద్రుడు దన్నాన సూరప్ప నాయుడు. బైరెడ్డి లక్ష్మణరావు గవిడి నాగరాజు జనసేన నియోజకవర్గ ఇన్చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర-భోగాపురం : ఆదర్శ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈస్టర్ పండుగ సందర్భంగా వాయిదా పడింది. ఏప్రిల్ 20 ఆదివారం జరగాల్సిన ఈ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21 సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సి. పార్వతి తెలిపారు. ఈ మార్పును 6వ తరగతి ప్రవేశ పరీక్షవ్రాస్తున్న విద్యార్థిని విద్యార్థులు అందరు గమనించి ఏప్రిల్ 21 సోమవారం పరీక్షకు హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

2లీటర్ల సారాయితో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస ప్రొహిబిసన్ %౦% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారి ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ వి.ఎస్.రాజు తన సిబ్బందితో కలిసి గురువారం నిర్వహించిన దాడుల్లో కొత్తవలస మండలం తమ్మన్నమెరక గ్రామంలో సరివల్లి దేముడు అనే వ్యక్తి రెండు లీటర్ల నాటు సారాయితో పట్టుబడినట్లు తెలిపారు. సారాయిని కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెంలో కొనుక్కున్నానని నిందితుడు తెలియచేయడంతో గ్రామంలో సోదాలు నిర్వహించామన్నారు. తదుపరి నిందితుణ్ని అరెస్టు చేసి కొత్తవలస మెజిస్ట్రేట్ వారి ముందు హాజరు పరిచి, వారి ఉత్తర్వుల మేరకు ఎస్.కోట సబ్ జైలుకు తరలించినట్లు వివరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పి.వీర్రాజు, బి.అధినారాయణ, అప్పన్నదొరపాలెం పంచాయితీ సెక్రటరీ డి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గర్భాం నాలుగో అంగన్వాడీ సెంటర్లో పోషణ్ పక్వాడ

ఐసిడియస్ సూపర్వైజర్ శ్రీదేవి

విశాలాంధ్ర-మెరకముడిదాం : ఈనెల ఏప్రిల్ 8 నుండి 22వ తేదీ వరకు పోషన్ పక్వాడ పక్షోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం 10 గంటల 30 నిమిషాలకు గర్భం అంగన్వాడి నాలుగో సెంటర్లో ఈ పక్షోత్సవాలు జరుగుతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి తెలిపారు. ఈ పక్షోత్సవాల్లో తల్లులకు పౌష్టికాహారం గూర్చి మరియు వెయ్యి రోజుల సంరక్షణ గూర్చి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

గ్రేహౌండ్స్‌కు కేటాయించిన భూముల్ని పరిశీలించిన జేసి

భూమికి బదులు భూమిని ఇస్తామన్న హామీ మేరకు రైతులకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర-కొత్తవలస : మండలంలోని రెల్లి రెవెన్యూ, అప్పన్నదొరపాలెం పంచాయితీ పరిధిలో పోలీస్ గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ కు ప్రభుత్వం కేటాయించిన సుమారు 512ఎకరాల భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ గురువారం సాయంత్రం కొత్తవలస మండల రెవిన్యూ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, ఆర్డీఓ దాట్ల కీర్తి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభ తీర్మానం సందర్భంగా గ్రేహౌండ్స్ ఏర్పాటుకు గానూ భూములను త్యాగం చేసిన 170 మంది గిరిజన రైతుల అభ్యర్థన మేరకు భూమికి బదులు భూమిని ఇస్తామన్న హామీమేరకు ఇదే రెవెన్యూ పరిధిలో సుమారు 200ఎకరాల భూములను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే గతంలో రైతులకు పట్టాలు పంపిణీ చేసిన ఇళ్ళ స్థలాలను జేసి పరిశీలించారు. పూర్తి వివరాలను స్థానిక రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసి గ్రామ పెద్దలతో మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేస్తామని స్పష్టం చేసారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు, డిప్యూటి తహసీల్దార్ పి.హరికుమార్, ఆర్ఐ రాజేష్, విఆర్ఓ కృష్ణమోహన్, గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ, ఎంపిటిసి ఉగ్గిన రాంబాబు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ రెల్లి గ్రూపు కులాలకు 5శాతం రిజర్వేషన్ కల్పనకు కృషి

విశాలాంధ్ర-బొబ్బిలి : భారతదేశ సుప్రీమ్ కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయు నిమిత్తం రాష్ట్రాలకు అధికారాలు కల్పిస్తూ తీర్పు ఇచ్చినందున ఎస్సీ రెల్లి గ్రూపు కులాల వారు ధన్యవాదాలు తెలుపుతూ వారి యొక్క విన్నపాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) సమర్పించారు.ఎస్సీ రెల్లి గ్రూపు కులాల వారికి 13 కులాలు ఉండి, లిపి లేనటువంటి కులాలను ఈ వర్గీకరణలో వేరు చేయకుండా ఏ కేటగిరీలో పెట్టి ఐదు శాతం వర్తింపజేయాలని కోరారు. ఈ 13 కులాల వారు కలిసి కట్టుగా ఉండి, ప్రభుత్వాలకు ఎన్నోసార్లు ఈ వెనుకబాటు తనాన్ని గురించి తెలియజేస్తున్నామన్నారు.

ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం ఫ్లై ఓవర్ వద్ద ఇటీవల తరచు రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది మృతి చెందడం మరి కొంతమంది తీవ్ర గాయాల పోవడం కావడంతో సంఘటనపై స్పందించి పట్టణ సీఐ సతీష్ కుమార్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతో పట్టణ ప్రజలు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే గురువారం పట్టణ సీఐ కె సతీష్ కుమార్ ట్రాఫిక్ ఎస్సై వి.జ్ఞాన ప్రసాద్‌లు సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నందు ప్రమాదాల నివారణ లో భాగంగా ట్రాఫిక్ రోడ్ ప్లాస్టిక్ కోన్స్ ను ఏర్పాటు చేశారు.